కష్టపడి కాకుండా ఇష్టపడి చదవండి

బాన్సువాడలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

పాల్గొన్న విద్యార్థినులు

కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

బాన్సువాడ, డిసెంబర్ 18 : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. బాన్సువాడలోని శ్రీజ్ఞాన సరస్వతీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం షెడ్యూల్డ్ కులాలు, వెనుకబడిన తరగతులు, గిరిజన అభివృద్ధి శాఖ వసతి గృహాల పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ, అవగాహన విజయస్ఫూర్తి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా శ్రీ సరస్వతి మాత చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ముఖ్యంగా అన్ని సబ్జెక్టులపై దృష్టి సారించాలన్నారు. తాను ఎంపీసీ, బైపీసీ చదివానని, కానీ ఉద్యోగ రీత్యా సోషల్, హిందీ చదవాల్సి వచ్చిందని విద్యార్థులకు తన అనుభవాన్ని వివరించారు. కార్యక్రమంలో షెడ్యూల్ తెగల జిల్లా సంక్షేమ శాఖ అధికారి రజిత, వెనుకబడిన తరగతుల అధికారి శ్రీనివాస్, జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, షెడ్యూల్ కులాల సహాయ సంక్షేమ అధికారి లియో, వెనుకబడిన తరగతుల సహాయ సంక్షేమ శాఖ అధికారి యాదగిరి, వసతి గృహాల అధికారులు శివరాం, గంగాసుదా, విజయభారతి, విజయశాంతి, లక్ష్మన్, శ్యామ్, విద్యార్థులు ఉన్నారు.

ఇంటి పన్ను చెల్లించాలి

బీబీపేట్, డిసెంబర్ 18 : మండలంలోని యాడారం, జనగామ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు బాలకృష్ణాగౌడ్, కళ్యాణ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కారోబార్లు, సిబ్బంది కలిసి సోమవారం ఇంటి పన్నులు వసూలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామస్తులు ఇంటి పన్ను చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సామర్థ్యాల వారీగా విద్యా బోధన చేయాలి

మాచారెడ్డి, డిసెంబర్ 18 : విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యార్థి సామర్థ్యానికి అనుగుణంగా విద్యా బోధన చేయాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటాచారి అన్నారు. సోమవారం మండలంలోని ఎంపీపీఎస్ శ్రీరాంనగర్, మాచారెడ్డి, మాచారెడ్డి ఎక్స్‌రోడ్ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా క్లాస్ రూంలను పరిశీలించారు. ప్రతి విద్యార్థికి అన్ని సామర్థ్యాలు వచ్చేలా బోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్పీ శ్రీహరి, సీఆర్పీ సంజీవ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులను పంపిణీ చేస్తున్న నారాయణ

పిట్లం, డిసెంబర్ 18 : మండలంలోని చిల్లర్గి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వడ్డేపల్లి నారాయణ సోమవారం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించేందుకు దుస్తులను అందజేశానని తెలిపారు. నారాయణను ఉపాధ్యాయుల, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హరీసింగ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, హేంసింగ్, పోశెట్టి, గ్రామ యువకులు నారాయణ, నగేశ్, విఠల్, వినోద్‌గౌడ్, ప్రవీణ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ రెసిడెన్షియల్ సందర్శన

బాన్సువాడ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

బాన్సువాడ, డిసెంబర్ 18 : బాన్సువాడలోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌ను విజిలెన్స్ అధికారులు సోమవారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు బోధిస్తున్న విద్య, మౌలిక వసతులు తదితర అంశాలపై విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. పాఠశాలలో నాణ్యమైన భోజనం అందిస్తున్నారని విద్యార్థులు తెలిపారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ధనలక్ష్మి, విజిలెన్స్ అధికారులు షేక్ హైమద్ జియా, రిటైర్డ్ ఎస్సై అమీనుద్దీన్‌తోపాటు స్టాఫ్ నర్సు దివ్య తదితరులు పాల్గొన్నారు.

హాకీ క్రీడాకారులకు అభినందన

విద్యార్థులను అభినందిస్తున్న ఆర్సీవో సత్యనాథ్‌రెడ్డి

నిజామాబాద్ స్పోర్ట్స్, డిసెంబర్ 18 : స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కామారెడ్డిలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి హాకీ పోటీల్లో కామారెడ్డి పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకులానికి చెందిన విద్యార్థినులు ప్రతిభ చూపినట్లు ఆర్సీవో సత్యనాథ్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ టీంపై 2-0 గోల్స్‌తో విజయం సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఆర్సీవోతోపాటు సెక్రటరీ మల్లయ్య, ప్రధానోపాధ్యాయిని ప్రమిదాదేవి, పీఈటీ మాన సారెడ్డి సోమవారం అభినందించారు.

నర్సరీల తనిఖీ

పిట్లం/ ఎల్లారెడ్డి, డిసెంబర్ 18: పిట్లం మండలకేంద్రంలోని నర్సరీని ఎంపీడీవో వెంకటేశ్వర్, ఎంపీవో బ్రహ్మం సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నర్సరీలో కొనసాగుతున్న బ్యాగ్ ఫిల్లింగ్ పనులను పరిశీలించారు. లక్ష్యం మేరకు ప్రజలకు ఉపయోగకరమైన మొక్కలను పెంచాలని నిర్వాహకులకు సూచించారు. వారి వెంట ఏపీవో శివకుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి యాదగిరి ఉన్నారు. నాగిరెడ్డిపేట మండలం గోపాల్ పేటలో నిర్వహిస్తున్న నర్సరీని స్థానిక జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి పరిశీలించారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించాలని, ఎప్పటికప్పుడు కలుపు మొక్కలను తొలగించాలని ఉపాధి హామీ కూలీలకు సూచించారు. వచ్చే వర్షాకాలం నాటికి మొక్కలు ఏపుగా పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

67వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర బేస్‌బాల్ చాంపియన్‌గా ఉమ్మడి నిజామాబాద్ జట్టు

నిజామాబాద్ స్పోర్ట్స్, డిసెంబర్ 18 : మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు జరిగిన 67వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర బేస్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బాలికల జట్టు విజయం సాధించింది. ఫైనల్ మ్యాచ్‌లో కరీంనగర్ జట్టుపై 10-0 పరుగుల తేడాతో విజయం సాధించి చాంపియన్‌గా నిలిచినట్లు జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి సంగీతారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టోర్నమెంట్ అబ్జర్వర్ మర్కంటి గంగామోహన్, మహబూబాబాద్ జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి జ్యోతి బహుమతులు అందజేశారు. జనవరి 2 నుంచి 7 వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాస్‌పూర్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు జిల్లా నుంచి బాలికల విభాగంలో.. నక్షత్ర, శరణ్య, గంగోత్రి, జాస్మిన్, సాహితి, వైష్ణవి, బాలుర విభాగంలో.. విష్ణు, విష్ణువర్ధన్ ఎంపికైనట్లు తెలిపారు.

ట్రోఫీని అందుకుంటున్న ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్టు

ఇంట్లో నుంచి వెళ్లి చెరువులో శవమై తేలాడు

భిక్కనూరు, డిసెంబర్ 18 : మూడు రోజుల క్రితం ఇంటి నుంచి బయల్దేరిన వ్యక్తి చెరువులో శవమై కనిపించాడు. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన దేవనబోయిన నాగరాజు(42) వంటలు చేస్తూ జీవనం సాగించేవాడు. శుక్రవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో చుట్టు పక్కల, బంధువుల ఇండ్లల్లో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో ఎక్కడైనా వంటలు చేయడానికి వెళ్లి ఉంటాడని కుటుంబ సభ్యులు భావించారు. సోమవారం ఉదయం స్థానిక చెరువులో శవమై కనిపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించామని, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పచ్చ పురుగు నివారణపై అవగాహన

శనగ పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి

సదాశివనగర్, డిసెంబర్ 18 : మండలంలోని ధర్మారావుపేట్ గ్రామంలో సాగు చేస్తున్న శనగ పంటను మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శనగ పంటను ఆశించే పచ్చ పురుగు నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. పచ్చ పురుగు నివారణ కోసం ఇమామెక్టిన్, బెంజోయెట్ మందును పిచికారీ చేయాలన్నారు. ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్‌ను పిచికారీ చేయాలని సూచించారు. పంటలను నిత్యం పరిశీలించాలని, వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు పొందలన్నారు. ఏఈవో శ్రీనివాస్ నాయక్, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

బిక్కుంద, డిసెంబర్ 18: మండలకేంద్రంలోని 15వ వార్డుకు చెందిన మహిళలు తాగునీటి కోసం రోడ్డెక్కారు. బస్టాండ్ వద్ద ఖాళీ బిందెలతో సోమవారం నిరసన తెలిపారు. సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టినప్పటి నుంచి నల్లాలు రావడంలేదని, గ్రామ పంచాయతీ ఆధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని మహిళలు వాపోయారు. తాగడానికి బిందెడు నీళ్లు దొరకక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధికారులు స్పందించి తాగు నీటి సమస్య పరిష్కరించాలి కోరారు.

స్టోన్ క్రషర్‌లో పోలీసుల పికెట్

మాచారెడ్డి, డిసెంబర్ 18 : పాల్వంచ మండలంలోని మంథనిదేవునిపల్లి గ్రామశివారులో ఉన్న శ్రీనివాస స్టోన్ క్రషర్ వద్ద ఆదివారం రాత్రి కామారెడ్డి రూరల్ సీఐ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసుల పికెట్ ఏర్పాటు చేశారు. క్రషర్ వద్ద భారీ పేలుళ్లు చేస్తున్నారన్న సమాచారంతో కార్యాలయంలో తనిఖీలు నిర్వహించడానికి వెళ్లగా తాళం వేసి ఉన్నట్లు రూరల్ సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కార్యాలయ మేనేజర్ ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉన్నదని కార్యాలయం వద్ద భద్రతగా పోలీసులను ఉంచినట్లు తెలిపారు.

కంకర క్వారీని మూసి వేయాలి

పాల్వంచ మండలంలోని మంథనిదేవునిపల్లి గ్రామంలో ఉన్న ఓ కంకర క్వారీని మూసి వేయాలని కాంగ్రెస్ పార్టీ పాల్వంచ మండలాధ్యక్షుడు రమేశ్‌గౌడ్ అన్నారు. కంకర క్వారీని మూసి వేయించాలని గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ నాయకులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాల్వంచలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమేశ్‌గౌడ్ మాట్లాడారు. గ్రామస్తులకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని చెప్పారు. ఇంతియాజ్, రవి గౌడ్, మజార్, షరీఫ్, సమరసింహారెడ్డి, భూపతిరెడ్డి, భూమయ్య, మంతరాజు దేవునిపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.